

సుబ్రమణ్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

శివారు కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

● వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

హయత్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని సుబ్రమణ్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీల ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దొంగతనాలు, ప్రమాదాలు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు అవసరమన్నారు. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. కాలనీలలో ఏలాంటి సంఘటనలు జరిగిన 100కు ఫోన్ చేయాలని కోరారు. పెద్ద మొత్తంలో సీసీ కెమోరాలను ఏర్పాటు చేసుకున్నందుకు కాలనీ సంక్షేమ సంఘాన్ని ఏపీసీ అభినందించారు. అనంతరం కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి సుబ్రమణ్యం నగర్ కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ రామకృష్ణ, బీజేపీ నాయకుడు బండారు భాస్కర్, ఉగాది ఎల్లప్ప, మహేష్, గోవిందాచారి, కాలనీ అధ్యక్షుడు అశ్వినీ భాస్కర్, గోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్-1 ఆర్‌టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సంస్థ అభివృద్ధి కోసం సూచనలు, సలహాలను ఇవ్వడానికి మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డిపో మేనేజర్ విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలు ఫోన్ నంబర్ 99592 26138 ద్వారా తెలపాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్, తదితరులు

స్కాలర్‌షిప్‌లకు రూ. 200 కోట్లు కేటాయించాలి

● తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాస్

ఎల్బీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించడంపై తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపింది. సోమవారం ఆర్‌కేపురంలో జరిగిన సమావేశంలో సమాఖ్య గ్రేటర్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమాన్ని కాంక్షించే రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా విదేశీ విద్య చదువుకుంటున్న బ్రాహ్మణ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి కోసం అదనంగా కనీసం రూ. 200 కోట్లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆదుకోకపోతే వందలాది మంది విద్యార్థుల చదువు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదమున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి భాస్కరమూర్తి, ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, నాగరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చామకూర రాజు, తదితరులు

నేడు బీసీ రిజర్వేషన్‌పై సదస్సు

వనస్థలిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బంజారహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు సదస్సును నిర్వహిస్తున్నట్లు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు తెలిపారు. సోమవారం ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహం వద్ద సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్యామ్ సుందర్ గౌడ్, ఒంటెద్దు నరేందర్, వంశరాజ్, శ్యామ్ యాదవ్, రామాచారి పాల్గొన్నారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవతో మనస్తాపానికి గురైన భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ నెల్లికుదురు గ్రామానికి చెందిన రాంబాబు, భార్య బూర్గుల స్వప్న(24), ఇద్దరు పిల్లలతో కలిసి అబ్దుల్లాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. రాంబాబు కూలీ పనులు చేస్తుండగా ఆమె ఇంట్లోనే ఉంటుంది. కొంత కాలంగా ఇద్దరి మధ్య గొడవ జరుగుతున్నట్లు తెలిసింది. గొడవలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె సోమవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం పని కోసం వెళ్లిన రాంబాబు తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య ఉరేసుకుని కనిపించింది. విషయాన్ని వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

వృద్ధురాలిని ఓల్డేజ్‌హోమ్‌లో చేర్చిన పోలీసులు

చిక్కడపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని ఓ వృద్ధ మహిళను చిక్కడపల్లి పోలీసులు చేరదీసి ఓల్డేజ్‌హోమ్‌లో చేర్పించారు. హిమాయత్‌నగర్‌కు చెందిన 70 సంవత్సరాల వృద్ధురాలు ఎరమిల్లి లాలమ్మ భర్త గతంలో చనిపోయాడు. ఆంధ్రప్రదేశ్ విజయవాడకు చెందిన ఆమె బాగోగులు చూసుకోవడానికి కుటుంబీకులు, సన్నిహితులు ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆమెను సోమవారం పీఎస్‌కు తీసుకువచ్చి బోజనం పెట్టించారు. ఆమెకు పాదరక్షలు ఇప్పించి ఘట్‌కేసర్‌లో ఉన్న ఓల్డేజ్‌హోమ్‌లో చేర్పించారు.

పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కళానిలయం సాంస్కృతికసేవా సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా సినారె ప్రతిభా పురస్కారాలు ఈనెల 31న త్యాగరాయగాన సభలో ప్రదానం చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. సామాజిక కార్యకర్తలు, సేవా సంస్థల ప్రతినిధులు, కళాకారులు, కవు లు, సంగీత, సాహిత్య, గాన, కళా, సేవా ఉపాధ్యాయ, నటీనటులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, జర్నలిస్ట్ రంగాలవారు దరఖాస్తు చేయవచ్చునని, ఇతర వివరాలకు 95505120 32 నెంబర్ ద్వారా తమ పేర్లు నమో దు చేసుకోవాలని సూచించారు.



రెడ్డిబస్తీలో పలహార బండి ఊరేగింపులో ఎంపీ డీకే అరుణ



రెడ్డిబస్తీలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి దంపతులు



సైదాబాద్ ఊరేగింపులో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు

వైభవంగా ఘటాల ఊరేగింపు

ప్రశాంతంగా ముగిసిన బోనాలు



సైదాబాద్‌లో రథంపై వేషధారణలతో కళాకారులు

సైదాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో సైదాబాద్‌లో అమ్మవారి ఘటాల ఊరేగింపు సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు, జానపద కళాప్రదర్శనలు, పోతురాజుల విన్యాసాలు, విచిత్ర వేషాధారణల మధ్య ఊరేగింపు కొనసాగింది. శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాకాళి జాతర ఉత్సవాలు 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఊరేగింపులో భాతరదేశ ప్రాచీన చరిత్రను, సంస్కృతికి అద్దం పట్టే విధంగా ప్రత్యేకంగా అలరించిన వాహనాలలో పౌరాణిక, సాంఘిక వేషధారణలు పలువురిని విశేషంగా ఆకర్షించాయి.

పోలీసుల భారీ బందోబస్తు..

అమ్మవారి ఘటాల ఉరేగింపు సందర్భంగా ముందస్తు చర్యలో భాగంగా సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా మహిళా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

రెడ్డిబస్తీలో..

రెడ్డిబస్తీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫలహార బండి ఉరేగింపుకు ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఉరేగింపు నాగులమ్మ ఆలయం నుంచి ఏకలవ్యనగర్, మూడుగుళ్ల మీదుగా సాగింది.



నాదర్‌గుల్‌లో పోతురాజుల చిందులు

బడంగ్‌పేట్‌లో...

సరూర్‌నగర్: బోనాల జాతర సందర్భంగా ఆదివారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని పలు డివిజన్లలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫలహార బండితో పాటు తొట్టెల ఊరేగింపును సైతం నిర్వహించారు. పోతరాజులు ఘటాల ఎదుట నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.



జిల్లెలగూడలో ఊరేగింపులో కళాకారుల విన్యాసాలు

మీర్‌పేట్‌లో

మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ కమలానెహ్రూ కాలనీలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఫలహార బండి ఊరేగింపును అందెల శ్రీరాములుయాదవ్ ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు.



పోతరాజుల విన్యాసాల నడుమ అమ్మవారి ఘటం ఊరేగింపులో ఉత్సవాల కమిటీ చైర్మన్ రవికుమార్ పటేల్, బాబు శ్రీనివాస్ తదితరులు



ముసారాంబాగ్‌లో పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దండెం రాజశేఖర్‌రెడ్డి, బొక్క గోవర్ధన్‌రెడ్డి, తదితరులు



చాదర్‌ఘాట్‌లో దర్బార్ మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నిర్వాహకుడు మధుకర్

ట్రంక్‌లైన్ తెచ్చిన తిప్పలు.. రోడ్డంతా గుంతలు..!

● మీర్‌పేట్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో స్థానికులకు తప్పని అవస్థలు
● పట్టించుకోని అధికార యంత్రాంగం



ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ గుంతలమయంగా మారిన రోడ్డు, గతంలో ఇదే రోడ్డుపై నిరసనగా ప్లకార్డులు పెట్టిన దృశ్యం (ఫైల్)

సరూర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు నివారణ కోసం చేపట్టిన ట్రంక్ లైన్ నిర్మాణ పనులతో రోడ్డు గుంతలమయమై స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో ఈ దుస్థితి నెలకొంది. కాలనీ మీదుగా గతంలో ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం అప్పటి వరకు ఉన్న బీటీ రోడ్డును పూర్తిగా తవ్వేశారు. ఆ సమయంలో స్థానికులు రోడ్డు తవ్వకాన్ని అడ్డుకోగా, ట్రంక్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత తిరిగి రోడ్డును నిర్మించి ఇచ్చే విధంగా కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నామని, రోడ్డును నిర్మింపజేసే బాధ్యత తమదేనని అప్పట్లో ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు. రోడ్డును తవ్వి దాదాపు నాలుగేళ్ల పాటు జాప్యం చేసి మొత్తం మీద ట్రంక్‌లైన్ పనులు పూర్తి చేశారు. నేటికీ కాలనీ రోడ్డును మాత్రం తిరిగి బాగు చేయడంలేదు. దీంతో రోడ్డంతా గుంతలమయంగామారి స్థానికులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ రోడ్డును బాగు చేయాలని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీవాసులు కోరుతున్నారు.



మునిసిపల్ కార్మికులతో మాట్లాడుతున్న సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్‌నాయక్

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి హరిసింగ్ నాయక్ పెద్దఅంబర్‌పేట్ మునిసిపల్ కార్మికులతో మాట్లాడారు. మునిసిపల్ కార్మికులు చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ విధానం, ఏజెన్సీ ద్వారా జీతాలు చెల్లించడంతో పనికి తగిన వేతనం దక్కడం లేదన్నారు. కార్మికులు చనిపోతే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. చల్లో అసెంబ్లీ ముట్టడికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, కార్మికులు , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కావడి పాల్కొడి ఉత్సవం

పద్మారావునగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్, స్కందగిరిలోని శ్రీ సుబ్రమణ్యస్వామి దేవాలయంలో సోమవారం లైపూసం ఆడికృతిక సందర్భంగా కావడి పాల్కొడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచే వందల సంఖ్యలో భక్తులు కావడి, పాలకుండలతో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. మేళతాళాల నడుమ, భక్తిపారవశ్యంతో నృత్యాలు చేస్తూ కావడి, పాలకుండలతో గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పాలకుండలతో సుబ్రమణ్య స్వామిని అభిషేకించిన తర్వాత దర్శించుకున్నారు. ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక నగరంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమ అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



కావడితో ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

● 30 సెల్‌ఫోన్లు స్వాధీనం

వనస్థలిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిధిలో సెల్‌ఫోన్లు దొంగతనం చేస్తున్న ఐదు మంది నిందితులను వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 30 సెల్‌ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు నిర్మానుష్య ప్రాంతాల్లో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఎ.కన్నయ్య, జి.వంశీ, అంబటి సత్యనారాయణ, ఎస్.చంద్రమోహన్, బండ్ల జైస్వాల్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం క్రైం సిబ్బందిని డీసీపీ అభినందించారు.

క్వారీ గుంతలో మునిగి బాలుడి మృతి



క్వారీ నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్థానికులు

పేట్‌బషీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన బాలుడు క్వారీ గుంతలో మునిగి మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కైసర్‌నగర్‌లో నివాసం ఉండే సల్మాన్‌కు ముగ్గురు కుమారులున్నారు. వీరి లో పెద్ద కుమారుడు సోయల్(10) కైసర్‌నగర్‌లోని మదర్సాలో చదువుతున్నాడు. సోమవారం స్కూల్ కు సెలవు కావడంతో అదే ప్రాంతంలో ఉంటున్న ముగ్గురు స్నేహితులతో కలిసి సోయ ల్ ప్రగతినగర్ సమీపంలో ఉన్న క్వారీ గుంతలో ఈత కొట్టడానికి నలుగురు వెళ్లారు. క్వారీ గుంత లో దిగిన ముగ్గురు బయటకు రాగా ప్రమాదవశాత్తు సోయల్ క్వారీ గుంతలోని రాళ్లలో ఇరుక్కుపోయాడు. దీంతో బయటకు రాలేక నీళ్లలో మునిగిపోయాడు. స్నేహితులు వారి బస్తీకి వచ్చి స్థానికులకు విషయం తెలిపారు. సమాచారం అందుకున్న బస్తీవాసులు క్వారీ గుంత వద్దకు చేరుకొని, జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. క్వారీ గుంతలోకి స్థానికులు దిగి సోయల్‌ను వెతికి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు.

దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ కొంటానని చోరీ చేసిన యువతి

యూసుఫ్‌గూడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ల్యాప్‌టాప్ కావాలని షాపుకు వచ్చిన యువతి చోరీకి పాల్పడింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 28న ఎస్ఆర్ నగర్‌లోని ఎలక్ట్రానిక్ షాపుకు ఓ యువతి వచ్చింది. అక్కడున్న రాజీవ్‌గౌడ్ అనే సేల్స్‌మన్‌తో ల్యాప్‌టాప్ కావాలని చెప్పింది. అతను ల్యాప్ టాప్‌లు చూపించాడు. కొంత సేపు చూసి వాటి వివరాలు తెలుసుకుని, తన ఫ్రెండ్ వస్తున్నాడు వచ్చాక తీసుకుంటానని చెప్పి అక్కడ కూర్చుంది.

దీంతో రాజీవ్ మరో కస్టమర్‌తో మాట్లాడేందుకు వెళ్లి వచ్చాడు. ఇంతలో అక్కడ ఆ యువతితో పాటు ల్యాప్‌టాప్ కనిపించలేదు. చోరీ చేసిందని గుర్తించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొల్ల కురుమలను విస్మరించిన ప్రభుత్వం

● నేటి నుంచి ఆగస్టు 15 వరకు మందబాట

బర్కత్‌పుర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కురుమలను అన్ని రంగాల్లో పూర్తిగా విస్మరించిందని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయినన శ్రీహరియాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ ఆరోపించారు. గొర్రె కాపరులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని వారు ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గంలో గొల్లకురుమలకు స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 15 వరకు గ్రామాలలో గొల్లకురుమల మందబాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15 తరువాత నగరంలో లక్షలాది మందితో గొర్ల కాపరుల జనజాతర నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లను కేటాయించాలన్నారు. గొర్రెల కాపర్లకు జీవాలమేత, వైద్యం, షెడ్లు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, ఇతర డిమాండ్లను కూడా నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నేతలు అయోధ్య యాదవ్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, దేవరాజుయాదవ్, రాములుయాదవ్, చంద్రమౌళి యాదవ్, సత్యం యాదవ్, నాగరాజు యాదవ్, సమ్మయ్యయాదవ్, సాగర్ యాదవ్, సూర్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో దొంగల అరెస్ట్...

హయత్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆటోలను దొంగతనం చేస్తూ కొంతకాలంగా తప్పించుక తిరుగుతున్న నలుగురు ఆటో దొంగలను హయత్ నగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆరు ఆటోలు స్వాధీనం చేసుకొని నిందితులను సోమవారం రిమాండ్ తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. హయత్ నగర్ సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉండే కుర్ర కిషన్ నాయక్ (47), బంజారా కాలనీలో నివాసం ఉండే సభవతి లచ్చు నాయక్ (35), సింగరేణి కాలనీలో నివాసముండే సభావాత్ కిషన్ నాయక్ (42), బంజారా కళ్లలో నివాసముండే బాల నాయక్ (29) కొంతకాలంగా ఆటోలను దొంగతనం చేస్తూ విడిభాగాలను చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గచ్చిబౌలి జగద్గిరిగుట్ట హయత్‌నగర్ ప్రాంతాలలో ఆరు ఆటోలను దొంగతనం చేసి విక్రయించారు. ఇదిలా ఉండగా సోమవారం హయత్‌నగర్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసులు అనుమానాస్పద స్థితిలో ఆటోలో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేయగా నలుగురు వ్యక్తులు కలిసి ఆరు ఆటోలను దొంగిలించినట్లు వెలుగులోకి వచ్చింది.

దీంతో హయత్ నగర్ పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.